# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హెచ్‌పివి టీకా కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు.**
3. **రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు కొదవలేదని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
4. **కల్తీ పాలు తాగి అనారోగ్యం బారిన పడిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **మూడో ప్రపంచ తెలుగు మహాసభలు ఈరోజు ప్రారంభమయ్యాయి.**

========================

హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సమక్షంలో 14 ఏళ్ల లోపు విద్యార్థినులకు వైద్యులు టీకాలు వేశారు. అనంతరం ప్రధానమంత్రి వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగా సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ..

వాయిస్...27 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లాలో ఈ రోజు పర్యటిస్తున్నారు. చీపురుపల్లి మండలంలోని రావివలస గ్రామంలో ఆయన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో 14 ఏళ్ల లోపు విద్యార్థినులకు ఏఎన్ఎమ్‌లు టీకాలు వేశారు. ఈ టీకాల వల్ల క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని విద్యార్థినులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. హెచ్‌పీవీ టీకా ఉపయోగాల గురించి విద్యార్థినులకు చెప్పారు. అనంతరం జరిగిన ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు కొదవలేదని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ఇండస్ట్రియల్ పార్క్ లో ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లూ జెట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. 2028-29 ఆర్థిక సంవత్సరంలో బ్లూ జెట్ హెల్త్ కేర్ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేష్ తెలియజేస్తూ..

వాయిస్...25 సెకన్లు

---------------------------

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపాలిటీ 28వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద వృద్ధులకు, వితంతువులకు, విభిన్న ప్రతిభావంతులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం వరిధనం గ్రామంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్టీఆర్ భరోసా ఫించన్లను ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు అందజేశారు.

---------------------------

కలుషిత పాలు తాగి అనారోగ్యం బారిన పడిన బాధితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన ఈరోజు పరామర్శించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితులకు మెరుగైన వైద్య సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ముంబాయి నుంచి యాంటీ డోస్‌లు తీసుకువచ్చి అందిస్తున్నట్లు చెప్పారు. కలుషిత పాలు తాగిన వారి ఆరోగ్య సంబంధిత విషయాలపై ఎప్పటికప్పుడు ఆరోగ్య శాఖ సిబ్బంది పరివేక్షణ చేస్తున్నారని వివరించారు.

---------------------------

మూడో ప్రపంచ తెలుగు మహాసభలు అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈరోజు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు మొదటి రోజు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ప్రవచనకర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికిపాటి నరసింహారావు హాజరయ్యారు. తెలుగు భాష పరిరక్షణకు ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి చేసేలా శాసనసభలో బిల్లు ప్రవేశ పెట్టేలా చర్యలు తీసుకుంటామని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభ ఉపన్యాసంలో తెలియజేస్తూ..

---------------------------

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులందరికీ ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా రూఫ్ టాప్ సోలార్ పానెల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీ, పొన్నాపురం ఎస్సీ కాలనీలో ఈ పథకం కింద

ఉచితంగా ఏర్పాటు చేస్తున్న 2 కిలోవాట్ల రూఫ్ టాప్ సోలార్ యూనిట్ల స్థాపన ప్రారంభ కార్యక్రమంలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. సోలార్ పానెల్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంబంధిత వెండర్ ప్రతినిధులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

---------------------------

తిరుమలలోని అన్నమయ్య భవనంలో తిరుమల తిరుపతి దేవస్థానం  పాలకమండలి సమావేశం ఈరోజు జరుగుతోంది. టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు అధ్యక్షతన జరుగుతున్న సమావేశంలో టిటిడి ఈవో  రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. 5400 కోట్ల రూపాయల వార్షిక టిటిడి బడ్జెట్ ఆమోదం కోసం ప్రతిపాదనలపై చర్చ జరుగుతోంది. అలాగే రిలయన్స్ సహకారంతో, అధునాతన సాంకేతికతతో నూతన అన్నదాన భవనం  నిర్మాణం పై చర్చిస్తున్నారు. టిటిడి విద్యాసంస్థల్లో ప్రమాణాలు పెంచడంతో పాటు మొత్తం 87 అంశాలతో కూడిన అజెండాతో టిటిడి పాలకమండలి సమావేశం జరుగుతోంది.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 ప్రపంచ కప్‌లో భాగంగా సూపర్ 8 గ్రూప్ 2లో శ్రీలంక, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. శ్రీలంకలోని పల్లెకెలెలో ఈరోజు రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.  కలకత్తాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సూపర్ 8 గ్రూప్ 1లో రేపు భారత్, వెస్టిండీస్  జట్లు తలపడనున్నాయి. రేపు గెలిచే జట్టుకు సెమీ ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంటాయి.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పరీక్షల నేపథ్యంలో వసతి గృహాల్లో  తరుచూ వైద్య శిబిరాలు నిర్వహించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా తక్షణమే ఆ విద్యార్థులను మెరుగైన వైద్య సేవల నిమిత్తం సమీపంలోని ప్రభుత్వాసుపత్రులకు తరలించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులున్నాయన్నారు. వర్షాలు, చలి, వేడి…ఇలా భిన్నమైన వాతావరణ పరిస్థితులతో విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని మంత్రి  పేర్కొన్నారు.

=====================